సాక్షి సంగారెడ్డి

శనివారం : 27 : జనవరి : 2024

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి





జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్లు

న్యూస్‌రీల్

300 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో నిర్వహిస్తున్న ర్యాలీ

జహీరాబాద్: పట్టణంలో 300 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు, యువతీ యువకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. 65వ జాతీయ రహదారి గుండా బాగారెడ్డి స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చేందుకు అనేక ఉద్యమాలు జరిగాయని, ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎంజీ రాములు, శుక్లవర్ధన్ రెడ్డి, జి.భాస్కర్, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ ప్రారంభించడం సంతోషకరం

ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి: పోలీసుల కోసం ఏర్పాటు చేసిన సెంట్రల్ పోలీస్ కాంటీన్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ గతంలో ఉన్న కామధేనువు కాంటీన్‌ను విస్తరించి, అధునాతన హంగులతో ఆధునీకరించి కలెక్టర్ ప్రారంభించడం సంతోషకరం అన్నారు. ఈ కాంటీన్ ద్వారా సుమారుగా 20 నుంచి 40 శాతం రాయితీ లభించనున్నట్లు వివరించారు. అన్ని రకాల కిరాణ వస్తువులు ఈ కాంటీన్‌లో పోలీసులకు అందుబాటులో ఉంటాయని, ఇతర వస్తువులు కావలసిన వారు నోటీస్ బోర్డులో రాసినట్లైతే వాటిని కూడా సమకూర్చే చర్యలు తీసుకొంటామన్నారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ జిల్లా పోలీసులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ డా.పి.అశోక్, అదనపు ఎస్పీ రాములు నాయక్, డీఆరోఓ నగేశ్, సీఐలు రమేశ్, భాస్కర్, రవి, మహేశ్‌గౌడ్, ఆర్ఐలు రాజశేఖర్, రామరావు, హన్మరెడ్డి, కాంటీన్ ఇన్‌చార్జి నరహరి, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహపూర్వక క్రీడలు ముఖ్యం

సిద్దిపేటజోన్: క్రీడలు స్నేహపూర్వకంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం అన్నారు. గురువారం రాత్రి స్థానిక స్టేడియంలో జ్యూడీషియల్, పోలీస్‌శాఖల మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. పోటీలో పోలీస్ శాఖ జట్టు విజయం సాధించింది. విజేతలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుమతులు అందజేసి మాట్లాడారు. విధి నిర్వహణలో ఉండే రెండుశాఖల వారికి అప్పుడప్పుడు ఇలాంటి మ్యాచ్‌లు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి మురళీమోహన్, జూనియర్ సివిల్ జడ్జి చందన, అడిషినల్ డీసీపీలు శ్రీనివాస్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక అభివృద్ధి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం అందించే రాయితీ పథకాలతో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో గొర్రెల కాపరులకు మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం మండల పరిధిలోని దౌలాపూర్‌లో రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 12 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. జీవాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్వేత, వీఏ శ్రీనివాస్, హరిప్రసాద్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కొండపాక(గజ్వేల్): వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేసి తీరుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ పాలనే లక్ష్యం

- అభివృద్ధికి పునరంకితం కావాలి
- మహనీయుల ఆశయాలు కొనసాగించాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తూ..



సంగారెడ్డి: జిల్లా అభివద్ధికి అందరూ పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్లో 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీసుల నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి కె.ప్రభాకరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ అశోక్, అదనపు కలెక్టర్ల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ క్రాంతి జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

అధికారులు, నేతలకు శుభాకాంక్షలు..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులకు జిల్లా యంత్రాంగం తరఫున ఆమె శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో అందరికీ సమన్యాయం చేకూరేలా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రూపొందించిన భారత రాజ్యాంగం జనవరి 26, 1950న అమల్లోకి వచ్చిందని, అప్పటి నుంచి గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా మనుగడ సాధించడానికి, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి దిశలో పయనించడానికి అంబేద్కర్ చేసిన కృషేనని కొనియాడారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆయన బృందాన్ని స్మరించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడి అసువులు బాసిన ఎందరో మహనీయులకు ఈ సందర్భంగా నివాళులర్పిస్తూ, వారి ఆశలు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదాం అని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి

స్వాతంత్రం సిద్ధించిన తర్వాత దేశం ప్రగతి పథంలో పయనించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలకు రూపకల్పనచేసి అమలు చేస్తున్నాయని, ప్రజలకు సంక్షేమ పాలన అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు కృషి

ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత ఈ ఆరు గ్యారంటీల అమలు కార్యాచరణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేసిందని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా 'మహాలక్ష్మి'

ఆరు గ్యారెంటీలలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని, ఈ పథకంలో భాగంగా జిల్లాలోని అన్ని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రతిరోజు సుమారు 51 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నార న్నారు. పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 24 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మొత్తం ప్రయాణికుల్లో 57శాతం మహిళలు ప్రయాణం చేస్తున్నారని, ఇది మహిళా సాధికారితకు నిదర్శనంగా చెప్పవచ్చన్నారు.

మెరుగైన వైద్యసేవలు

పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు, సేవలు అందించడం ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. అందులో భాగంగా వైద్యం అందక ప్రాణాలు పోగొట్టుకోకూడదనే ఉద్దేశ్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీలో అందుతున్న వైద్య సేవలు ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు పెంచి ఉచిత వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. అలాగే మిగిలిన నాలుగు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, జిల్లాలో మొత్తం 3,91,565 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటన్నింటినీ ఆన్‌లైన్ చేయడం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులకు పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సుపరిపాలన అందించే దిశగా చర్యలు

జిల్లా ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. అందులో భాగంగా వైద్యం, విద్య, వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పన, మహిళా శిశు సంక్షేమం, తాగునీరు, పారిశుద్ధ్యం, పట్టణ సుందరీకరణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించడంలో సహకరించిన పోలీసులు, అధికారులు, సిబ్బందికి, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో రానున్న పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయనించడానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాల కృషిచేస్తోందన్నారు.



త్రివర్ణ పతాకంతో విద్యార్థుల విన్యాసం



జిల్లా గ్రామీణ అభివృద్ధి శకటం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

డిప్యూటేషన్ ఉత్తర్వులు సస్పెండ్

కొమురవెల్లి ఏఈఓ అంజయ్య రీజాయినింగ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న వైరాగ్యం అంజయ్యపై పలు ఆరోపణలు రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఇటీవల మెదక్ అసిస్టెంట్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆలయ ఈఓ బాలాజీ ఏఈఓ అంజయ్యను రిలీవ్ చేశారు. దీంతో ఏఈఓ తన పదవీ విరమణకు 11 నెలల సమయమే ఉందని.. కొందరు కావాలనే అసత్య ఆరోపణలు చేశారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు దేవాదాయశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు సస్పెండ్ చేసి అతడిని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే రీజాయినింగ్ చేసుకోవాలని దేవాదాయ శాఖను ఆదేశించడంతో ఏఈఓ శుక్రవారం ఈఓకు జాయినింగ్ ఉత్తర్వులు అందించారు. ఈవిషయమై ఈఓను వివరణ కోరగా ఏఈఓ రీజాయినింగ్ ఉత్తర్వులు ఇచ్చిన విషయం వాస్తవమేనని.. దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశామని ఉత్తర్వులు వచ్చిన వెంటనే జాయినింగ్ చేసుకుంటామని తెలిపారు.

జోగిపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా..

మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట (అందోల్): అందోల్ -జోగిపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం జోగిపేటలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. మైదానాన్ని పరిశీలించి గత కాంగ్రెస్ పాలనలో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్‌స్టేడియం నిరుపయోగంగా మారడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. క్రీడాకారులకు అనుకూలంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు రోడ్లు, వంతెనలు నిర్మించేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. చిలప్‌చెడ్ మండలం అజ్జమరి పరిసర ప్రాంత ప్రజలు జోగిపేటకు వచ్చేందుకు వీలుగా మంజీరా నదిపై వంతెన నిర్మించేందుకు, నూతనంగా రోడ్డును ఏర్పాటు చేసేందుకు మార్గాన్ని ఆయన పరిశీలించారు. జోగిపేటలోని రూ.1.20 కోట్లతో నిర్మించిన రైతుబజార్ వాడకంలో లేకపోవడంతో దాని స్థానంలో నర్సింగ్‌కళాశాల ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఆయన వెంట ఆర్‌డీఓ పాండు, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్‌లు రంగసురేశ్, ఎస్.సురేందర్‌గౌడ్, హరికృష్ణాగౌడ్ తదితరులు ఉన్నారు.



గ్రీన్ ఫీల్డ్ స్టేడియంను పరిశీలిస్తున్న మంత్రి దామోదర

కులవృత్తులు కనుమరుగు

- అంతరించిపోతున్న కళలు
- ఉపాధి లేక ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వాలు



చాటలు అల్లుతున్న భార్యాభర్తలు

మునిపల్లి(అందోల్): కులవృత్తికి సాటి రాదు గువ్వల చెన్నా.. అన్నది ఒకప్పటి మాట. ఇప్పుడు వాటికి ఆదరణలేక అంతరించి పోతున్నాయి. వారికి జీవనోపాధి లేక కుటుంబాలను నెట్టుకు రావడం భారంగా మారింది. యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి అందుకోలేక చేతి వృత్తుల కళాకారులు చితికిపోతున్నారు. ఒక్కప్పుడు గౌరవంగా తలెత్తుకు తిరిగిన కుల వృత్తుల వారు. ఇప్పుడు ఆదాయం లేక కొట్టుమిట్టాడుతున్నారు. సరైన ప్రోత్సాహం, చేయూత అందక ఇతర పనులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇష్టమైనా, కష్టమైనా తమ వృత్తులను వదిలిపెట్టాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

యాంత్రీకరణ.. తగ్గిన ఆదరణ

గతంలో కులవృత్తుల కళాకారులు గ్రామాల్లో ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. ఒకరు తయారు చేసిన వస్తువులు మరొకరు కొనుక్కొనేవారు. దీంతో వారి జీవనం సాఫీగా సాగేది. క్రమేపి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దానిని అందుకోలేని వారు వెనుకబడిపోయారు. కుండలు, వెదురుతో చేసే గంపలు, చాటల స్థానంలో ప్లాస్టిక్ వస్తువులు వచ్చి చేరాయి. వాషింగ్ మెషీన్‌లు రావడంతో రజకులు తమ వృత్తులను కోల్పోయారు. కల్లు స్థానంలో వివిధ రకాల మద్యం వచ్చింది. డప్పులు, బుర్ర కథలకు బదులు బ్యాండులు, డీజేలు వచ్చాయి. విస్తరాకుల స్థానాన్ని పేపర్ ప్లేట్లు ఆక్రమించాయి. ఇలా అన్ని రంగాల్లో ఆధునికత కులవృత్తులను కుదేలు చేసింది.

వృత్తులను ప్రోత్సహించాలి

ఆధునికతను అందిపుచ్చుకోవడంతో పాటు మన సంస్కృతిని, నాగరికతను, పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కాబట్టి సాధ్యమైనంత వరకు కులవృత్తులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. నూతన పథకాలను రూపొందించి ఆదుకోవాలి. రాయితీపై రుణాలు అందించి ఆదుకోవాలని కుల వృత్తుల వారు కోరుతున్నారు. అవసరమైన పని ముట్లను, ముడి సరుకును ఉచితంగా అందించే విధంగా చర్యలు తీసుకొంటే తమ వృత్తులు మునుపటి శోభను సంతరించుకుంటాయని వారు ఆకాంక్షిస్తున్నారు.

జీవన భృతి కల్పించాలి



ఒకప్పుడు గ్రామాల్లో తిరిగి బుర్ర కథలు చెప్పేవాళ్లం. అప్పుడు మా కథలే ప్రజలకు మంచి వినోదం. ఇప్పుడు సినిమాలు, టీవీ షోలు, డీజేలు, ఆర్కెస్ట్రాలు వచ్చాక ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వం నుంచి సరైన చేయూత లేదు. బుర్రకథ, ఒగ్గు కళాకారులకు జీవన భృతి కల్పించాలి.

– శంకరయ్య, బుడగ జంగం

ప్లాస్టిక్ రాకతో ఇబ్బందులు



గతంలో వెదురు బొంగులతో గంపలు, చాటలు, తడికలు, అల్లి కుటుంబాలను పోషించుకునేటోళ్లం. ఇప్పుడు ప్లాస్టిక్, ఫైబర్‌తో చేసిన వస్తువులు వస్తున్నాయి. దీంతో మాకు పని లేకుండా పోయింది. కుటుంబ పోషణ భారంగా మారింది. మాకు పని కల్పించి ఆదుకోవాలి.

– దుర్గారాణి, మేదరి

పెట్టుబడుదారుల కొమ్ముకాస్తున్న కేంద్రం

- సీఐటీయూ నాయకుడు చుక్కా రాములు
- మతోన్మాద విధానాలను నిరసించాలి

జహీరాబాద్ టౌన్: కార్మికుల పొట్టను కొడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారుల కొమ్ముకాస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ఆరోపించారు. పట్టణ సమీపంలోని మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలో శుక్రవారం నిర్వహించిన కార్మిక యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేఏళ్ల నుంచి కార్మిక, రైతాంగ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని వాపోయారు. కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. కార్మిక చట్టాల రద్దును ఆపాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణికి నిరసనగా ఫిబ్రవరి 16న జరుగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, మహీంద్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలను నిరసించాలని, 16న దేశవ్యాప్తంగా సమ్మె, గ్రామీణ బంద్‌ను ప్రజలంతా విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీహెచ్‌ఈఎల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి రావడం కోసం అనేక కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, దీనిని ప్రజలందరూ గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దారుణమైన విషయం అని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజయ్య, నాయకులు పెంటయ్య, బాషా, వీరన్‌రావు, ప్రభాకర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

ఉత్తములు వీరే..

సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, అధికారులు, పోలీసుల సేవలకు అవార్డులు వరించాయి. విధి నిర్వహణలో ప్రతిభ, సమయస్ఫూర్తిని ప్రదర్శించినందుకు ఉత్తమ సేవా వార్డులకు ఎంపికయ్యారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆయా జిల్లాల కలెక్టరేట్‌లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, మెదక్ కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

-సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



(కుడి నుంచి ఎడమకు)

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి చేతుల మీదుగా పత్రాలు అందుకుంటున్న చంద్రశేఖర్, మాధురి, రూపేష్, నగేశ్, శ్రీనివాస్, ఎల్లయ్య, రవీందర్, సురేశ్ మోహన్, జగదీష్, వనజాత, సుగుణ భాయ్, పరమేశం, దశరథ్, నాగేశ్వరరావు, ఫర్వీన్ షేక్, విజయలక్ష్మీ, కార్తీక్



కిరణ్ కుమార్, అరుణోదయ చారి, నందకిషోర్, కార్తీక్ , ప్రవీణ్ రెడ్డి, రాహుల్, అరుణ్, పాషా , మహేందర్, సాయి, మల్లప్ప, మల్లేష్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఖదీర్, సుభాష్, సలాం, సాయిలు, (కుడి నుంచి ఎడమకు)



సుభాష్, నారాయణ, వెంకటేశ్వర రెడ్డి, జయంతి, డాక్టర్ అశోక్, సుజాత, ఉదయ్ కుమార్, విజయలక్ష్మి, అనీల్ కుమార్, శ్రీధర్, ప్రదీప్, రవీందర్, అంజయ్య, సమద్, రామాచారి, కృష్ణ (కుడి నుంచి ఎడమకు)



మెదక్ కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, వసురాం, నరేందర్ రెడ్డి, ఉమాదేవి, హన్మంత్, సందీప్, రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్

క్లుప్తంగా

సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జాతర నిర్వాహకులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను సూచించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ప్రాజెక్టులు



ప్రాజెక్టులతో సుష్మ



రితేష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్): దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌లు శుక్రవారం తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 10 ప్రాజెక్టులు ఎంపికవ్వగా అందులో రెండు ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయన్నారు. మర్కూక్ మండల పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ దామరకుంటలో 9 తరగతి చదువుతున్న విద్యార్థిని సుష్మ, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని స్ప్రింగ్ డల్స్ పాఠశాలలో చదువుతున్న రితేష్‌ల ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో రాణిస్తే, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక అవుతారని తెలిపారు. విద్యార్థులను గైడ్ టీచర్లు బ్రహ్మయ్య, కృష్ణకుమార్‌లను అభినందించారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో శుక్రవారం సిద్దిపేట కోర్టులో సమావేశం నిర్వహించారు. జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందించడం అనే అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జైలులో ఉన్న 18 నుంచి 22 ఏళ్ల వయసు ఉన్న ఖైదీలను గుర్తించి న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం మత్తులో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి పంచాయతీ పరిధి ఎల్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కానికె వెంకటేశ్(45) శుక్రవారం ఉదయం లేవలేదు. ఇంటి తలుపులు మూసి ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారు వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించాడు. తాగుడుకు బానిసై మద్యం మత్తులో వెంకటేశ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ప్రతీ ఆలోచన వెనుక ఓ సైన్స్

- ప్రజల్లో గొప్ప చైతన్యానికి నాంది
- అందరూ శాఖాహారులుగా మారాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



శాఖాహారుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ప్రతీ ఆలోచన వెనుక ఓ సైన్స్ ఉంటుందని, అలాగే శాఖాహారం వెనుకా సైన్స్ ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం కొండ మల్లయ్య గార్డెన్స్‌లో శాఖాహారుల మెగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఒక్క శాతం మాత్రమే శాఖాహారులు ఉన్నారని, మిగతా అంత కూడా మాంసాహారులని పేర్కొన్నారు. శాఖారుల సంఖ్య పెరగాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పట్టణ వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ప్రతినిధులు పాండు, రవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో అయోధ్య ప్రత్యేక అతిథిగా వెళ్లి వచ్చిన వైద్యులు అరవింద్ ఎమ్మెల్యే హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులకు అవగాహన కల్పించాలి

నియోజకవర్గ పరిధిలోని రైతులను గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో కలిసి అధికారులు వ్యవసాయ సాగు సూచనలు చేసి మరింత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ప్రధాన పంట వరి వల్ల ప్రతీ సంవత్సరం పంట మార్పిడి లేక మొగి పురుగు ఉధృతి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై రైతులను చైతన్యం చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగునీరు పెరిగి యాసంగి లో వరికి రైతులు మక్కువ చూపుతున్నారని పేర్కొన్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్



నరేశ్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన గువ్వ నరేశ్(30)కు తొమ్మిదేళ్ల కిందట క్షీరసాగర్‌కు చెందిన లతతో వివాహమైంది. వీరికి తొమ్మిదేళ్ల లోపు అక్షయ, లిపిత్, వంశీ ఉన్నారు. నరేశ్ సమీప పరిశ్రమలో కార్మికుడు కాగా, భార్య దినసరి కూలీ. సంసారం విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నరేశ్ ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే రాత్రి మృతుడి భార్య లత సమీపంలోని మామ మల్లేశ్ ఇంటికి వెళ్లి భర్త నరేశ్ ఉరి వేసుకొని చనిపోయాడని తెలిపింది. అతడు వచ్చి చూడగా బెడ్‌రూం పైన సీలింగ్ కొక్కానికి చీర వేలాడుతూ కనిపించగా, నరేశ్ కింద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గదిలో బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. నరేశ్ మృతిపై తండ్రి మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తనంతట తానే ఉరేసుకున్నాడా లేదా మరెవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ అవార్డులు



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



విద్యార్థిని సన్మానిస్తున్న సర్పంచ్ సంజీవరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్–2024 విన్నర్ శామంతుల అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాష్ట్రప్రభుత్వం 20 జిల్లాల్లోని 44 మంది ఇన్నోవేటర్స్ విజేతలను ప్రకటించింది. ఇందులో మద్దూరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన శామంతుల అనిల్‌కుమార్ ఉన్నారు. గ్రామ సర్పంచ్ బద్దిపడగ లలితా కృష్ణారెడ్డి, గ్రామ కార్యదర్శి భాస్కర్ అనీల్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు రజిత, రేణుక అంగన్‌వాడీ టీచర్ సునీత, సీఏలు రేణుక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డును నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి విగ్నేష్ గెలుపొందారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్పంచ్ సంజీవరెడ్డి విద్యార్థిని సన్మానించారు. అతడితోపాటు అడ్జస్టబుల్ వాలీబాల్ నెట్ ఆవిష్కరణ చేసి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన అదే పాఠశాల విద్యార్థి ఆదిత్య వర్ధన్‌ను సన్మానించారు.

సైన్స్ ఫెయిర్‌లో ఆకట్టుకున్న సచివాలయ నమూనా



సచివాలయ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హీరా ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు తయారు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ నమూనా ఎమ్మెల్యేను ఆకట్టుకుంది. అనంతరం ఉత్తమ నమూనాలకు బహుమతులను ప్రధానం చేశారు.

అక్రమ ఇసుక రవాణా

ఐదు వాహనాలను పట్టుకున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ఐదు వాహనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐలు రమేశ్, నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ చౌరస్తా కుంకుమ మిల్లు వద్ద లారీ, మినీ టిప్పర్, బోలేరో వాహనంలో, చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు లారీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నామన్నారు. వాహనాలను సంబంధిత పోలీసు స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం 87126 67100, టాస్క్‌ఫోర్స్ అధికారులు 87126 67447కు సమాచారం అందించాలని సూచించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, భూంపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోత్రాల స్వామి (39) కూలీ పనులు చేసుకుంటూ భార్య రేణుక, పదేళ్లలోపు ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. ఏడేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేసి ఇంటిని నిర్మించుకున్నాడు. అప్పులు ఎక్కువై రెండేళ్ల క్రితం బతుకు దెరువు కోసం మస్కట్‌కు వలస వెళ్లాడు. అక్కడా సరైన పని దొరక్క 15 రోజుల క్రితం స్వగ్రామమైన మోతెకు తిరిగి వచ్చాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి రావడంతో ఇంట్లో గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో భార్య రేణుక పుట్టినిల్లు హుజూరాబాద్ మండలం తోకలపల్లికి వెళ్లింది. అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

నీటి కెనాల్‌లో పడి కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో ఖదీర్ మృతదేహం

సంగారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు నీటి కెనాల్‌లో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫసల్ వాది గ్రామానికి చెందిన ఖదీర్ (36) గణపతి చక్కెర పరిశ్రమలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పరిశ్రమ ఆవరణలో ఉన్న నీటి కెనాల్ లో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు కాలుజారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిలల్లు ఉన్నారు. పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆర్థికంగా ఆదుకుంటామని పరిశ్రమ యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, సంగారెడ్డి రూరల్ సీఐ సుధీర్ కుమార్, ఎస్సై రాజేశ్ నాయక్ యాజమాన్యం ఉన్నారు.

చిన్నారుల్లో మేధాశక్తి పెరుగుతుంది



చిన్నారికి డ్రాప్స్ వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఆయుర్వేద మందు చిన్నారుల్లో మేధాశక్తి పెరగడానికి దోహదపడుతుందని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ కల్పనా ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన ఆయుర్వేద మందు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై చిన్నారులకు డ్రాప్స్ వేశారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ రాజ్‌కుమార్, బాధ్యులు సాయికుమార్, వెంకట్‌రావు, పండరిరెడ్డి, వినోద్ పాటిల్, జైపాల్‌రెడ్డి, మన్మథ కిషోర్, ప్రసన్నకుమార్, జ్ఞానేశ్వర్‌గౌడ్, అనిల్‌గౌడ్, నర్సింహులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్‌లో ఈనెల 30న ఉదయం 10గంటల నుంచి పట్లోళ్ల కిష్టారెడ్డి ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హోలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించనున్న ఉచిత గుండె, సాధారణ వైద్య శిబిరాన్ని ఖేడ్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. ఆయన స్వగృహం ఆవరణలో శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రమేశ్ చౌహాన్, శంకర్ ముదిరాజ్, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి

పటాన్‌చెరుటౌన్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. భానుర్‌కి చెందిన అంజిరెడ్డి(39) బీడీఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తుంటూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అంజిరెడ్డి ఆటో తీసుకొని శంకర్‌పల్లి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్నాడు. బీడీఎల్ పరిశ్రమ సమీపంలోకి రాగానే ఆటో యూటర్న్ చేస్తుండగా పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా అంజిరెడ్డి పై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య చంద్రకళ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.